అండర్‌పాస్‌లలో రాకపోకలకు అవస్థలు

- బురద, వాన నీటితో జారుతున్న ద్విచక్ర వాహనచోదకులు
- పవర్‌పేట అండర్‌పాస్‌లో ఊరుతున్న నీరు
- శాశ్వత పరిష్కారం కోరుతున్న నగర ప్రజలు



వర్షపునీటితో నిండిన పవర్‌పేట రాజీవ్ స్నేహవారధి


వర్షం లేని రోజుల్లోనూ బురదగా ఉన్న రాజీవ్ స్నేహవారధి


సీఆర్‌ఆర్ కళాశాల వద్ద తమ్మిలేరు ఏటిగట్టును ఆనుకుని ఉన్న అండర్‌పాస్


సత్రంపాడు వద్ద ఉన్న అండర్‌పాస్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నగరంలోని ఒన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాలను వేరుచేస్తూ రైల్వే ట్రాక్ అడ్డంగా ఉంది. పెరుగుతోన్న జనాభా రవాణా సౌకర్యాల కోసం ఆయా ప్రాంతాలను కలుపుతూ రైల్వే ట్రాక్ కింద నుంచి నగరంలో మూడు అండర్‌పాస్‌లు ఏర్పాటు చేశారు. ఆయా అండర్ పాస్‌లు ప్రయాణానికి వెసులుబాటుగా ఉన్నా.. అప్పుడప్పుడూ ప్రమాదాలను కూడా కొనితెస్తున్నాయి. ఆయా అండర్‌పాస్‌లలో బురద చేరుకోవడంతో పాటు నాచు పట్టి వాహనాలు జారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు ప్రయాణీకులు ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా జారిపడి గాయాలపాలౌతున్నారు.

నగరంలో మూడు అండర్‌పాస్‌లు

నగరంలో ప్రజల ప్రయాణ అవసరాల కోసం మూడు అండర్‌పాస్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పవర్‌పేట వద్ద ఒన్‌టౌన్ టూ టౌన్ ప్రాంతాలను కలుపుతూ రాజీవ్ స్నేహవారధిని నిర్మించి ట్రాఫిక్ కష్టాలను తొలగించారు. స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల వద్ద తమ్మిలేరు గట్టును అనుకుని మరో అండర్‌పాస్, సత్రంపాడు సమీపంలో రామకృష్ణాపురం, గ్రీన్ సిటీల వద్ద వేరొక అండర్ పాస్ ఏర్పాటు చేశారు. వీటి నుంచి ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు వచ్చే ప్రయాణీకులు ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసం లేకుండా సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు.

బురద, వాన నీటితో ప్రమాదాలు

- సీఆర్‌ఆర్ కళాశాల వద్ద తమ్మిలేరు గట్టును ఆనుకుని నిర్మించిన అండర్‌పాస్ వర్షం వస్తే నీటితో మునిగిపోతుంది. తమ్మిలేరు లోంచి కొంత నీటితో ఈ ప్రాంతం చెమ్మగిల్లి ఎప్పుడూ చిత్తడి, బురదతో దర్శనమిస్తుంది. ఒక పక్క ఫుట్‌పాత్ ఏర్పాటు చేయడంతో పాదచారులకు కాస్త వెసులుబాటు కలుగుతోంది. ద్విచక్రవాహనచోదకులు ఫుట్‌పాత్ పైనుంచి వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫుట్‌పాత్ పై ఎదురెదురుగా వచ్చే వాహనచోదకులు ఒక్కోసారి పడిపోతున్నారు.
- సత్రంపాడు వద్ద ఉన్న అండర్‌పాస్ ఒక వైపు పెద్ద మురుగుకాల్వ ప్రవహిస్తుండడంతో నీరు లీకై చిత్తడిగానే మారుతుంది. నీటి లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.
- ముఖ్యంగా పవర్‌పేట వద్ద అండర్‌పాస్ కొద్దిపాటి వర్షానికే నీటి మునిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వాన లేకపోయినా ఈ అండర్‌పాస్ నిత్యం అధిక నీటి ఊటతో చిత్తడిగానే ఉంటుంది. నీటి ఊట కారణంగా నాచు పట్టి వాహనచోదకులు అనేక సందర్భాల్లో జారిపడి గాయాలపాలయ్యారు. ఇక్కడ ఊరే నీటిని తోడేందుకు ఒక పంప్ హౌస్ ఏర్పాటు చేశారు. దీని నిర్వహణకు లక్షలాది రూపాయలు వ్యయం చేయాల్సి వస్తోంది. గట్టివాన కురిస్తే అండర్‌పాస్‌లో పీకల్లోతు నీరు చేరి రాకపోకలను నిలిపేస్తారు. దీంతో ప్రయాణీకులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది.

శాశ్వత పరిష్కారం చూపాలి



నగరంలోని అండర్‌పాస్‌ల కారణంగా నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు సగానికి పైగా తగ్గిపోయాయి. అటూ, ఇటూ తిరిగే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటున్నాయి. అయితే వాటిలో ముఖ్యంగా పవర్‌పేట రాజీవ్ స్నేహవారధిలో ఎప్పుడు చూసినా బురద, ఇసుక మేటలు, నాచుతో ఇబ్బందికర పరిస్థితి కనిపిస్తుంది. దీనికి అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

– గేదెల రాజారావు, ఏలూరు

ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలి



రోజురోజుకీ నగరంలో పెరుగుతోన్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది. పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద ఓవర్‌బ్రిడ్జి మంజూరు కావడంతో కొంత ఇబ్బంది తీరుతుంది. మిగితా అండర్‌పాస్‌ల వద్దా ఓవర్ బ్రిడ్జిలు నిర్మించే అవకాశంపై అధ్యయనం చేయాలి. కూడా ఓవర్‌బ్రిడ్జిలు నిర్మిస్తే ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది.

– రెల్ల నాగరాజు, ఏలూరు

క్లుప్తంగా

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన జేపీ


రామకృష్ణారెడ్డిని కలిసిన ఏలూరు ఇన్‌చార్జి జయప్రకాష్

ఏలూరు టౌన్ : వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏలూరులోని రాజకీయ పరిస్థితులను ఆయనకు వివరించారు.

నేడు మండల పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.ప్రణవి తెలిపారు. మూడు కమిటీలకు చెందిన సభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు, పరిపాలన, సంక్షేమం తదితర అంశాలపై సభ్యులు చర్చించనున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలోని విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. డీ–4 సెక్షన్ పరిధిలోని కొమడవోలు – ఆటోనగర్ ఫీడర్ పరిధిలోని ఆటోనగర్, కొమరవోలు, తూర్పులాకులు, సాయి నగర్‌ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఒన్‌టౌన్ ప్రాంతంలో కొత్తగూడెం సెంటర్, 7 కాల్వల సెంటర్ చాటపర్రు రోడ్డు, తూర్పు వీధిసాయి బాబా గుడి ప్రాంతం, తూర్పు వీధి గంగానమ్మవారి ఆలయ ప్రాంతం, ఫిల్‌హౌస్ పేట, వీవర్స్ కాలనీ, పోణంగి రోడ్డు, చిరంజీవి బస్టాండ్ సెంటర్, దక్షిణపు వీధి, కుండీ సెంటర్, గడియార స్తంభం సెంటర్, కత్తేపు వీధి, తూర్పు వీధి, న్యూ మార్కెట్ ప్రాంతం, బెనర్జీ పేట, వెన్నవల్లివారి పేట, సత్యనారాయణ పేట, లంబాడీ పేట, అగ్రహారం, మెయిన్ బజార్, కెనాల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఐక్య బ్రాహ్మణ సేవా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఐక్య బ్రాహ్మణ సేవా సమాఖ్య నగర నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం స్థానిక రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో నిర్వహించారు. సమాఖ్య నూతన అధ్యక్షుడిగా కందుకూరి రవి, కార్యదర్శిగా చాత్రాతి మదన్, కోశాధికారిగా భోగరాజు ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు, పలువురు అతిథులు పాల్గొన్నారు.

మార్క్సిస్ట్ మేధావి కామ్రేడ్ ఏచూరి


కామ్రేడ్స్ ఏచూరి, ఆర్‌ఎస్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఏలూరు (టూటౌన్): దేశంలో యునైటెడ్ ఫ్రంట్, యూపీఏ–1 ప్రభుత్వాలకు కీలకంగా వ్యవహరించిన మార్క్సిస్టు మేధావి, మాజీ ఎంపీ కామ్రేడ్ సీతారాం ఏచూరి నేటి రాజకీయ నాయకులకు ఆదర్శనీయుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) కొనియాడారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో కామ్రేడ్స్ సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్‌ఎస్)ల సంస్మరణ సభ సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి మంతెన సీతారాం, ఆర్‌ఎస్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎంఎస్ నాగరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏచూరి, ఆర్‌ఎస్ సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ లింగరాజు, పి.కిషోర్, జి.రాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏలూరు(మెట్రో): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సీనియారిటీ ప్రకారం ఎస్‌ఎంఆర్ లేదా హెచ్‌ఆర్ ఉద్యోగులుగా పరిగణించాలని ఏలూరు జిల్లాలో గృహ నిర్మాణ శాఖలో పొరుగుసేవల విధానంలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్లు కోరారు. ఈ మేరకు వారు మంత్రి కొలుసు పార్థసారథిని ఏలూరులోని రెవెన్యూ అతిథి గృహంలో గురువారం కలిసి తమ సమస్యలను వివరించారు. తమతో పాటు నియమితులైన డీఆర్‌డీఏ, డ్వామా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ శాఖల్లోని వారికి హెచ్‌ఆర్ పాలసీని అమలు చేస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు. సమస్యను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ సిబ్బంది కె.నాగభూషణం, పావని, చంద్రశేఖర్, కె.పోసుకుమార్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

లింగ భేదం లేని సమాజానికి కృషిచేద్దాం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీపీఓ సూర్యచక్రవేణి

ఏలూరు (టూటౌన్): లింగ భేదం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణాధికారిణి (డీసీపీఓ) సీహెచ్ సూర్య చక్రవేణి అన్నారు. స్థానిక లేడీస్ క్లబ్‌లో దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా కో ఆర్డినేటర్ సింగవరపు జ్యోతి అధ్యక్షతన స్త్రీ, పురుష సమానత్వంపై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూర్య చక్రవేణి మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలు, పురుషాధిక్యం అనేవి ఎక్కువగా ఉన్నట్టు వివిధ సర్వేల ద్వారా వెల్లడైందన్నారు. అందం, రూపం, సృష్టి సమాజంలో అందమైన భావాలన్నారు. స్త్రీ ఓర్పుకి చిహ్నం, ఆత్మ స్థైర్యవంతురాలని వివరించారు. ఒన్‌స్టాప్ సెంటర్ సీఏ సీహెచ్ నిర్మల మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన ఫిజికల్‌గా, మెంటల్‌గా అరాచకానికి గురైన వారికి గృహ హింస, వరకట్నం, బాల్యవివాహాలు, భార్యాభర్తల తగాదాలు, ఎటువంటి సమస్యలపైనైనా తమ సెంటర్‌ను ఆశ్రయించాలని కోరారు. అన్ని సర్వీసులను ఒకే దగ్గరకు చేర్చి న్యాయం చేస్తామన్నారు. న్యాయం జరగకపోయినా, అనుమానాలు ఉన్నా కాల్‌సెంటర్ నెంబర్ 181కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. మానిటరింగ్ అండ్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎం హేమలత మాట్లాడుతూ సమాజం ముందు మనము, మన కుటుంబం నుంచి ప్రారంభించి ఇతరులకు రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ జె.రమణ మూర్తి, ఎంపీటీసీ డి.అమల, డీబీఆర్‌సీ ప్రతినిధులు జి.ఝాన్సీరాణి, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలి

ఏలూరు(మెట్రో): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే దేశాభివృద్ధి సాధ్యమని గాంధీజీ ఆశయానికి అనుగుణంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కొత్త బస్టాండ్, జన్మభూమి పార్కుల వద్ద కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కలు నాటారు. రోడ్లపై చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ, జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్పమణి మాట్లాడారు. జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, మున్సిపల్ కమిషనరు ఎన్ భానూప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ర్యాలీలు

ఏలూరు రూరల్ : గ్రామాల్లో పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దళిత్ బహుజన రీసోర్స్ సెంటర్ సభ్యురాలు జి.ఝాన్సీరాణి ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని కోరారు. జాలిపూడిలో పరిశుభ్రతపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించామని తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు – తిరుపతి	16.00	4830	26

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	68–100
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07,10
బెండకాయలు	24	కంద	60
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	38
కాకర కాయలు	28–48	కీరా దోస	40
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	--	అల్లం	70–140
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	44–54	పాలకూర	15
దొండకాయలు	40	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	30–40	బఠాణి	--
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20–25	చిలకదదుంప	58

సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబాపూలే


కార్యక్రమంలో మాట్లాడుతున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్) : సామాజిక విప్లవ కారుడు మహాత్మా జ్యోతిబా పూలే అని పలువురు నాయకులు కొనియాడారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే సత్యశోధక్ సమాజ్ ఏర్పాటు వెలుగులో ప్రజలంతా పని చేయాలని కోరుతూ ఏలూరు ఇఫ్టూ జిల్లా కార్యాలయం నుంచి జూట్‌మిల్ ఫ్లై ఓవర్ వద్ద ఉన్న జ్యోతిబాపూలే విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. జ్యోతిబాపూలే విగ్రహానికి యర్రా శ్రీనివాసరావు, గడసాల రాంబాబులు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ ఏలూరు నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకినాని, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్, మేతర అజయ్ బాబు, గడసాల రాంబాబు, సీఏలీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాయవాది కేవీ రత్నం, కాకర్ల అప్పారావు మాట్లాడారు. సమ సమాజ స్థాపనే లక్ష్యంగా అలుపెరుగని పోరాటం చేసిన మహా సామాజిక విప్లవ యోధుడు జ్యోతిబాపూలే అని కొనియాడారు. కార్యక్రమంలో దూళ్ల వీరినాయుడు, జి.రమణ, సందకం అప్పారావు, రామ్మూర్తి నాయుడు, కోరాడ అప్పారావు, తాబేలు శ్రీను, కె.సాయి, బొల్లారపు నాగరాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకోవాలి



విద్యార్థినిని అభినందిస్తున్న సెట్‌వెల్ సీఈఓ ప్రభాకర రావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యువత వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకుని, అనుకున్న లక్ష్యాలను సాధించాలని సెట్‌వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకరరావు సూచించారు. యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముకని, మంచి నడవడికతో ఇతరులను గౌరవిస్తూ సమాజంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని అన్నారు. జిల్లా ఉపాధి కల్పనా అధికారి సి.మధుభూషణరావు, కెరీర్ కౌన్సెలర్ జి.ప్రవీణ్ కృష్ణ, వెకేషనల్ గైడెన్స్ కోర్స్ ఈఓ వి.వరలక్ష్మి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణ ప్రసాద్, సెట్ వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, సెట్ వెల్ పర్యవేక్షకుడు కేజే కెనడి, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే దోమల నివారణ

భీమడోలు: దోమల నివారణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని ఏలూరు జిల్లా మలేరియా అధికా రి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని వరద ముంపు బారిన పడిన ఆగడాలలంక గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన గురువారం పరిశీలించారు. దోమల నివారణ మందు పిచికారీ చేసే విధానాన్ని పర్యవేక్షించారు. ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలందించారు. గ్రామంలోని సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షపు నీరు ఎక్కడబడితే అక్కడ నిలిచి డెంగీ, మలేరియా దోమలు వృద్ధి చెందుతున్నాయని ప్రసాద్ అన్నారు. దోమ కాటు ప్రమాదకరమని హెచ్చరించారు.